కవితా కౌముది

# విముక్తి

అనూరాధ బండి

నిశ్చలనిర్మలనిర్మోహ కాలాలలో
నిర్భయానందాకాశ హర్మ్యాలలో
నీలికళ్ళ ఉషస్సులలో
సాంధ్యచ్ఛాయోద్రేకపుటెరుపు జీరలలో
నిస్తబ్దపరిమళపు మెరుపులలో
ఏది నిజమో!?

ఎలాగో ఏకాంతాన్ని పుచ్చుకుని
నిన్ను నువ్వు పుస్తకమనుకుని
పేజీలు తిప్పుకుంటూపోతావ్

పోనీ నువ్వే పుస్తకానివప్పుడు
నిన్ను చదివేది ఏకాంతమనుకుందాం
ఎన్ని వెలుగాక్షరాల సవ్వడోనా నువ్వంటే
లేక చీకటిస్వరపు మౌనాక్రందనా?

నిశ్శబ్దమావహించిన ఆ సమయమంతటినీ
మెత్తగా మెల్లగా తడుతోందెవరూ?
కన్నీటిభాషలో ఏకాంతానిది సమాధి స్థితా?!

★★★

# ఒంటరిగానే

డా.మాదిన రామకృష్ణ

చిన్నప్పట్నుంచీ నే వెళ్లనేలేదు
అందరిలా నే చూడనే లేదు
ఇతరుల్లా నే తెచ్చుకోలేదు
సాధారణ వసంతంలో నా కోరికల్ని

అదే మూలం నుంచి నే తీసుకోలేదు
నా (దుఃఖం)బాధ
నా గుండెల్లో ఆనందం ఆ తీరుగానే!
నే ప్రేమించినవన్నీ
ఒంటరిగానే ప్రేమించాను

అప్పుడు, నాచిన్నప్పుడు
నా ఈదర బ్రతుకు వేకువలో
మంచీ చెడ్డల లోతుల్లోంచి లాక్కున్నా!
ఆ మిస్టరీయే నన్ను ఇప్పటికీకట్టి పడేస్తుంది

జడివాన నుంచీ,జలధారనుంచీ
ఎర్రటి కొండకొమ్మునుంచీ
సముద్రము అంతానిండిన అత్తరు వాసనలనుంచీ
శరత్తులో బాలభాస్కరుని బంగారు రంగు నుంచీ

ఆకాశంలో మెరుపులు నన్ను దాటుకుపోయి
వచ్చిన ఆ ఉరుములనుంచీ ,జడివాన నుంచీ!
పైని ఆకాశమంతా నీలంగా వుంటే
ఓమబ్బుమాత్రం ఏదో ఆకారంలా కన్పడితే
దాన్ని ఓ భూతం అనుకున్నా నేను
అందరిలో కాదు,ఒంటరిగానే !

★★★★

# రసరేఖలు

శ్రీధర్ బచ్చోటి

ఇది ధనుర్మాసవేళ, దినేశ్వరుండు
నడచెనింతదనుక దక్షిణదిశ వైపు
మకరగేహమాహ్వానపత్రికను పంప
కదలునుత్తరోన్ముఖుడౌచు గగనమందు

ఉదయముననే గవాక్షమ్మునుండి చూతు
ధవళకాంతులు బరపెడు తరణి వంక
తెరచి యుంచుదు తలుపుల దీప్తి కొరకు
మాయజాలను మనసును మూసినట్లు

ఎంత యుజ్వలమైనదీ యినుని కాంతి
దిక్కులన్నియు ప్రాకు దేదీప్యకాంతి
కాంతి మాత్రమే వీక్షింప గలము గాని
ఆ మహోజ్వలవదనమ్మునరయగలమె

ధరణిపై కురిసెడు కాంతిధార యిద్ది
సర్వ జనులకు లభ్యమౌ జ్ఞానదీప్తి
వెలుపలను కాంతి, యింటిలోపలను కాంతి
మనసు లోపల వెలుపల తనరు కాంతి

వేకువను జూచినట్టి వేవెలుగు కాంతి
స్వాంతమందున బెట్టె దీపమ్ము నాకు
కనుల గప్పిన మాయలు కరిగిపోయి
స్పష్టమయ్యెను జీవనసారమెల్ల

COMMENTS